కథా నిలయం
3926
శ్రీకాకుళం

# అక్షింతలు

ఆఫీసులో అడుగు పెడుతుండగానే బల్లమీద పసుపురాసిన కవరు ఒకటి కంటపడ్డది: దాన్ని చూస్తుండగానే ఛెళ్లున వీపు నెవరో చఱచినట్టు జ్ఞాపకం వచ్చింది నాకు. రఘునాథరావుకు మాట యిచ్చాను. మర్చిపోయాను. నామీద నాకే అసహ్యం వేసింది.

"బాబ్బాబూ!" అంటూ బ్రతిమాలిన పెద్దమనిషికిచ్చిన మాట మర్చిపోయాను. మంచి స్నేహితుడ్ని అనుకుంటూ నా మీద గంపెడాశ పెట్టుకున్న మిత్రుడికి చేసిన వాగ్దానం మర్చిపోయాను. గానుగెద్దు బ్రతుకు. గాడిలో పడిపోయిందీ బ్రతుకు! నేను బదిలీ అయి రావడం, యిక్కడాఫీసులో 'జాయి'నవడం అన్నీ అయిపోయి మూడు వారాలపైమాట!

వీధివీధిలోను శ్రీరామ నవ మి ఉత్సవాలు అయిపోతున్నాయి. హై రోడ్ల మీద శ్రీరామ నవమి పందిళ్ళకు గుంజలు టెలిఫోన్ కేబిల్ లు తెగేలా గోతులు తవ్విపారేశారు. పెళ్లి పందిళ్ళు కూడ వేసేస్తున్నారు చాలా చోట్ల. ఝుమ్మని వేసంకాలం, పెళ్ళిళ్ళకాలం కూడబలుక్కొని వచ్చేస్తున్నాయ్!

అయ్యొ నేను రఘునాథరావుకిచ్చిన మాట మర్చిపోయాను. ఇప్పుడెవరిదో ఈ శుభలేఖ చూసేదాకా నేను శ్యామల్నీ, వసుధర్నీ కూడా మర్చిపోయాను.

మర్చిపోయానా?...మర్చిపోలేదు!

చూద్దాం...చూద్దాం అనుకుంటూనే బద్ధకించాను. వైశాఖం అల్లంత దూరానికొచ్చేస్తోంది.

నేను బదిలీ అయి వచ్చేస్తోవుంటే...పాపం. రఘునాథరావు, శ్యామలా దంపతులు యిద్దరూ పిల్లల్తో సహా స్టేషన్‌కు వచ్చారు. రైలు కదిలేదాకా వుండి మరీ నన్ను దిగబెట్టారు. పెళ్ళీడు పిల్ల వసుంధర. దాన్ని నాకు చూపించి "గుండెలమీద యీ కుంపటి దిగాలి" అప్పుడు ఈ కంటినిండా నిద్దర అన్నయ్య గారూ' ' అన్నది శ్యామల. శ్యామల యెంత మంచిది! సొంత అన్నదమ్ముడికి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోతున్నట్లు బాధపడ్డది! కాని నేనే 'ఉత్తమ యిల్లాలు ఆ పిల్లకు మాట యిచ్చి అన్యాయం చేశాను. ఈ వూరొస్తూనే ఆవూసే మర్చిపోయాను.

వెంటనే లోపలికెళ్లి, మేనేజర్ని చూసి, శలవడిగి 'ప్రకాశం' అనే కుర్రవాడి గురించి వాకబుచేద్దామనుకున్నాను. కాని అప్పుడే ప్రక్కనే కూర్చున్న సుభద్రాచార్యులు చిటికెడు నశ్యంముక్కులోకి దట్టించి 'అచ్చి' మన్నాడు పెంకులెగిరేలా. 'ఛీ! శుభం కోర్రా, అంటే!' అని లోపలే విసుక్కుని రేపు పోదాంలే అనుకున్నా.

ఇల్లాగే, అక్కడ ఆఫీసులో నా ప్రక్కనే కూర్చునేవాడు రఘునాథరావ్. కాని ఇలాంటి వాడుకాదు. మంచివాడు. పిల్లలవాడు. మర్యాదస్తుడు. నిజంగా నేనంటే ఆ మొగుడూ పెళ్ళాంకూడా ప్రాణం పెట్టేవారు. కాని నేనో! 'మా' వసుంధరకు అంటే రఘునాథరావ్ దంపతుల జ్యేష్ఠ పుత్రికకు పండంటి వరుడొస్తాడమ్మా అంటూ చెప్పి మరీ యిలా యీ వూరు బదిలీ అయివొచ్చి మర్చిపోయాను.

శ్యామల, భర్తకన్న మంచిది. "అన్నయ్యగారూ!" అంటూ నోరారా పిలిచేది.-"వొదినెగారు పురిటికి వెళ్ళారు. మీకేమో యిలా బదిలీ అయింది. పాపం! ఆ పాడువూళ్లో మీకు హోటేలు మెతుకులు ఎలా వొంటిని పడతాయో నని"-బాధపడ్డది. ఆవకాయ 'హార్లిక్స్ సీసా' నిండా పెట్టియిచ్చింది. కందిపొడుం స్వయంగా విసిరి గ్లూకోజు డబ్బానిండా పోసియిచ్చింది. అవి నేనెక్కడ మర్చిపోతానో అని చెప్పి; రైలు కదిలేదాకా హెచ్చరిస్తూనే వుంది.

ఓ ముక్కా యింతవూటా, సిగ్గుపడక హోటేలుకి పట్టుకుపోయి, వేసుకోండి అన్నయ్యగారూ! అని చెప్పింది.

వసుంధరను చూపించి, "మీ మేనకోడలే ఆ ఆవకాయ పెట్టింది. ఎలా ఉందో రాయండి" అన్నది. అంతమంచి శ్యామల తన కూతురికి వరుణ్ణి వెతకడానికి నేను బద్ధకించుతానని ఎలా అనుకుంటుంది? పైగా నేను రైలు కదిలేముందు వసుంధర బుగ్గమీద చిన్న చిటికవేసి 'దీనికేం? బంగారు బొమ్మ రాజాలాంటి వరుణ్ని యిస్తాడు దేవుడు" అన్నాను.

రఘునాథరావు చెప్పాడు. అతని దృష్టిలోనున్న ఒక అబ్బాయి గురించి. పేరు ప్రకాశం. బియ్యే ప్యాసైనాడట...ఆర్.టి.సి ఆఫీసులో వెయ్యి నూట యాభై వరకూ తెచ్చుకుంటున్నాడట. పైగా 'బాదరు బందీ' లేనివాడు. గ్రంథంవారి మేడ అని లబ్బీపేట ప్రాంతంలో ఎవర్ని అడిగినా చెబుతారట. అక్కడ "బాచులర్స్" చాలా మంది వుంటున్నారట. కుర్రవాడు బుద్ధిమంతుడనీ పాతికపై చిలుకు వయసనీ విన్నా! వీలైతే ఆ వూరు పోంగానే నువుకాస్త కనుక్కొని నాకురాయి." ఈ వైశాఖంవూరికే వెళితే "నేను ఉరిపోసుకుంటా"నంటూంది మీ చెల్లెలు. కన్నెధారపోసేస్తాను. దాని పోరైనా తీరుతుందీ"...అన్నాడు.

నేను తలూపాను. తప్పకుండా అలాగే చూస్తాను అన్నాను. నాకు మాత్రం బాధ్యతలేదా? అన్నాను.

కాని యిదే నా? బాధ్యత ?

చైత్ర మాసం యెండే ఐనా ప్రచండంగా వుంది. అయినా సరే రేపు వెళ్లామనుకున్నాను. వసుంధరకు దాచకుండా చెప్పినా యింకా పదిహేడు సంవత్సరాలు. స్కూలు ఫైనలు పరీక్షలు-పాపం! బాగానే రాసింది. ఒక్క మార్కులో పోయింది వెధవ పరీక్ష- మా శ్యామల చాదస్తంకాని యీ రోజుల్లో మరీ యిలా

పెద్ద మనిషి కాంగానే అలా మూడుముళ్ళూ యెవడు వేయిస్తున్నాడూ అంటా!

ప్రకాశం అనే కుర్రవాడి గురించి మా రఘునాథరావుకు యెవరు చెప్పారో కాని, మా వాళ్ళిద్దరి మనస్సుల్లోనూ తమ పిల్లకు అతగాడే తగిన వరుడు అని బాగా నాటుకుపోయింది. నేను కూడా ఎంచేతనో "అవుతుందమ్మా! అవుతుంది" అన్నాను శ్యామలతో.

"ఆ నాలుగక్షింతలూ నువ్వేవేయాలి అన్నయ్యా" అన్నది వెర్రిబాగుల్ది. శ్యామల తొందర్లో నోరుజారినన్ను "అన్నయ్యగారూ" అనడానికి మారుగా "అన్నయ్యా" అనీ, బహువచనానికి బదులు 'నువ్వు' అనీకూడా అనేసింది. రైలు కదిలిపోయింది. ఆ దంపతుల బేలతనానికి నా హృదయం కదిలిపోయింది.

రైలు కదలంగానే, మొదట వాళ్ళు ఆప్యాయంగా తెచ్చియిచ్చిన సంచి చూసుకున్నాను. అందులో శ్యామల వసుంధర 'చేసినట్లు' చెప్పిన ఆవకాయ, కందిపొడుం వగైరా ఉన్నాయి. చేగోణీలు, జంతికలూ వున్నాయి. నేను ప్రకాశం అనే కుర్రవాడు అదృష్టవంతుడనుకున్నాను. వసుంధర కాస్త చామనచాయ కాని 'కళ' ఆ అమ్మాయి మొహంలో మూర్తీభవించి వుంటుంది; గుణవంతురాలు, పనిమంతురాలు.

నేను జరిగిపోయిన అన్యాయాన్కి లెంపలు మనసా వేసుకున్నాను. మర్నాడు శలవుకోసం ఓ చీటీ రాశాను.

గ్రంథం వారి మేడకదూ అన్నాడు.

ప్రకాశం గురించి అతని "పత్తాసత్తా"ల గురించి రఘునాధరావు చెప్పింది జ్ఞాపకం తెచ్చుకొంటున్నాను. నెమరువేసుకుంటున్నాను.

పాతికేళ్లు పైచిలుకే వుంటాయట అబ్బాయికి రఘునాథంచెప్పినదాన్ని బట్టి ప్రకాశాన్కి ముందూ వెనుకా ఎవరూ లేరు. పైగా తల్లీ దండ్రీ కూడా స్వర్గస్తులైనారల్లేవుంది. వొంటరిగా పట్నవాసాన పొట్టపోసుకుంటున్నాడు. హోటలు మెతుకులు తినలేక కాస్త వంటా వార్పూ వచ్చినపిల్ల దొరికితే చాలు-కాపురం పెట్టేసుకుందామని అనుకుంటున్నాడని రఘునాధరావుకు ఎవరో చెప్పారట.

"వంట వండే యిల్లాలు చాలూ; వైజయంతి మాల లాగా డాన్సూ, లతామంగేష్కర్‌లాగా పాటా అక్కర్లేదూ, అంటే, మా వసుంధరకన్న ఎవడికైనా మరో చక్కని యిల్లాలు దొరకదు" ఆ సంగతి నేను చెప్పగల్ను.

నేరుగా నేను మండుటెండ అయినా లెక్కచేయక చెమటలు వొత్తుకుంటూ ఆర్.టి.సి. ఆఫీసుకే పోయాను. పాతికేళ్ళవాడు, ఫలానివారి అబ్బాయి, వాళ్ళవూరు కంకిపాడు కాబోలు అంటూ ఎంక్వయిరీ చేశాను. అతని తండ్రి పేరు తెలియదు. తల్లిపేరు తెలియదు. కాని పట్నవాసంలో వుద్యోగాలు చేసే మొహాల్ని పట్టుకోడాన్కి అమ్మా, నాన్నల పేరు అక్కర్లేదుగా!

కర్మకాలి యిద్దరు ప్రకాశాలున్నారట. ఒకడు అకౌంట్స్ సెక్షన్‌లో వుంటున్నాట్ట. రెండోవాడు

జనరల్ డిపార్టుమెంటుట!

అదృష్టవశాత్తు రెండో ప్రకాశానికి మూడేళ్ళ క్రితమే పెళ్ళైపోయింది. అంటే మనకు కావాల్సిన ప్రకాశం యితడు కాడన్నమాట.

ఎందుకంటే నేను రఘునాథందగ్గర మాటయిచ్చి యీ వూరు-అంటే 'బదిలీ' అయ్యే అనుకోండి-వచ్చి రెండు నెలలెక్కడయిందీ? మూడు వారాలేగా!

ఆ "పెళ్ళికాని ప్రకాశం" అనేవాడు కావాలని వాకబు చేశాను. ఎవరికెవరు? తన ప్రక్క సీటులో కూచుని పనిచేస్తున్నాడు శలవుమీద వున్నాడో, బర్తరఫ్ అయే వెళ్ళాడో, వున్నాడో వూడేడో తెలీదు అనేవాళ్ళున్నారు. కాని చివరికి అప్పారావుట అతనిపేరు, అతను చెప్పాడు. ప్రకాశం కొంచెం నల్లగా, కాస్త లావూ అని లావుగానూ గాక; సన్నంగా అని సన్నముగాక సుమారు తనంత ఎత్తు (అతను నా అంత ఎత్తున్నాడు) వుంటాడట, అయిదారు రోజులైందిట. శెలవుపెట్టి నట్లుందిట. కారణం అప్పారావుకు తెలియదట. ఇక యీ 'ట' కారాలతో లాభంలేదని నేను లబ్బీపేట-అంటే ఆ అబ్బాయి వుండే నివాస స్థలానికే ప్రయాణం అయ్యాను. రిక్షవాణ్ణి పిలిచాను. అరఫర్లాంగు దూరంలో నిలబడి 'కావాలంటే' నువ్వే యిక్కడదాకా రా అన్నట్లు గంట కొడతాడేగానీ దగ్గరికి రాలేదు. ఎండ అలావుంది! కాకులు కూడా సోలి పోతున్నాయి!!

కాని, రఘునాథరావు శ్యామల వాళ్ళ రుణం ఎలా తీరుతుంది? తెల్లవారు ఝామునైనా, అర్థరాత్రియైనాసరే లేచి విసుక్కోకుండా నాకు కాఫీ కలిపి తెచ్చియిచ్చే యిల్లాలు శ్యామల. భోజనాల వేళ వెళ్తేచాలు. విస్తరి వేస్తేనేకానీ కదల్నిచ్చేవాడు కాదు ఇంటాయన. పిల్లలంతా మావయ్యా అంటూ నాతోనే వుండేవారు. మా ఆవిడను పురిటికి పంపిన మూడు మాసాలూ నాకు రఘునాథరావుగారి ఇంటనే యించుమించు గడిచిపోయింది.

ఆ గ్రంథం వారి మేడ యీ 'రఘు' అన్నట్టు నిజంగా 'పాపులరే'! దానిగోడలమీద, ఎలక్ట్రిక్ తీగెలకు వేళ్లాడే గబ్బిలాల్లాగ అక్కడా అక్కడా గుడ్డలూ తువ్వాళ్ళూ అవీ వ్రేలాడుతున్నాయి. గదుల పెట్టెలో అరలలాగున్నాయి గదులు. వరసాగ్గా వున్నాయి.

ఎండ! ప్రాణాలు పోయాయి. అది చూసేసరికి కాస్త కుదుట పడ్డాయి. అక్కడేవున్న "పాకలో" చెరుకు రసం అమ్ముతున్నారు. మరిన్ని నీళ్లు పోసియిమ్మని అది యింత త్రాగి యీదురోమంటూ మూడో అంతస్తుదాకా యెక్కాను.

అంతా బ్రహ్మచారుల్లాగే వున్నారు! సిగరెట్ ధూమం వరండాలోకి నా ముక్కు పుటాల్లోకి దూరి వస్తోంది. గది కిటికీలకు రీటా హేవర్త్‌నుంచి జ్యోతిలక్ష్మి బేతింగ్ సూటు వేషం దాకా వున్న అన్ని రకాల బొమ్మలూ రంగురంగుల్లో అతికించి వున్నాయి.

ఒక గది మీద ప్రకాశమూర్తీ యల్.యల్. అని సుద్దముక్కలతో "రాసి , రాసి, రాసి," స్పష్టంగా వుండేలా చేసిన పేరుంది. ప్రక్కనే రంగు సుద్దతో ఆర్.టి.సీ అని వుంది, బ్రాకెట్‌లో కాని, ఏం లాభం?

గది గుమ్మంకో గొళ్లెం! దానికో తాటి కాయంత తాళం కప్ప, వేసి వున్నాయి. ప్రక్క రూములో నుంచి యీల వినపడుతోంది. మిట్ట మధ్యాహ్నం లాగేవుంది అవతలెండ. కాని గంట నాలుక్కావస్తోంది. తలుపు కొట్టాను. మళ్లా సాయంకాలం అయితే సినిమాలకు పోతారుగా కుర్రాళ్ళు.

"కమిన్" లోపల్నించి ఒక కంఠం!

"ఈ ప్రక్క రూమ్‌లో ప్రకాశం అనీ..."

"హియీజ్ గాన్..." మళ్ళీ యీల వేసుకుంటున్నాడా యువకుడు.

ఎక్కడికి వెళ్ళాడండి?

'డోంట్ నోసార్!' మళ్ళీ యీల...

"సారీ" అంటూ యీవతలి వేపు రూమ్‌లోకి తొంగి చూసాను.

"ఎవరూ?" అన్నాడు కొంచెం పీలగావున్న యువకుడొకడు.

"ఈ ప్రక్క రూమ్ అబ్బాయి ప్రకాశం...?"

"ఓ...అతనా? వూరెళ్ళాడండీ..." అన్నాడు. లుంగీ ఒకటి మాత్రం కట్టుకున్నాడు. ఉక్క చంపేస్తోందిగా మరి! గుండెల మీదకు ఓ తువ్వాలు పడేసుకుంటూ చెప్పాడతను పడకమంచం మీద పడుక్కునే.

"మీరేమి అనుకోపోతే, మే అయికమిన్? " అన్నాను లోపలికి వెళ్లి పోయి.

"షూర్! షూర్! రండి" లేచి కూచుని ఓ స్టూలు నాకేసి తోశాడు.

ఈ అబ్బాయినీ; ప్రకాశం గురించి అడగవల్సినవీ, అడగరానివికూడా అన్నీ అడిగాను. ప్రకాశమూర్తి వాళ్ల వూరు కంకిపాడేగాని అతనికి అక్కడ ఎవరూ లేరట. ఒక యిల్లు వుంది. దాని మీద అద్దె వస్తుందిట. ప్రస్తుతం వాళ్ల దూరపు బంధువులెవరో వుంటే అక్కడికి అంటే బందరుకి వెళ్ళాడట.

నాకు పూర్తిగా ఆశనిరాశైపోయింది.

"ఇక లాభంలేదు" అనుకున్నాను. అయినా ప్రయత్నం ఎందుకు వదిలేయాలి? ఆ అబ్బాయినే మరికొన్ని ప్రశ్నలు వేశాను.

నిజమేనట! ప్రకాశం చాలా సార్లు తనతో చెప్పాడట. 'వొంట వొండి కాస్త వుప్పూకారం సరిగ్గా వేసి పెట్టే టందుకేనా ఒక అమ్మాయిని తను పెళ్ళిచేసుకోబోతున్నట్టు.

కట్నం 'ఆశా' అంటూ లేదు కానీ కనీసం పాతికవేల నూట పదార్లేనా వుండొద్దా? అని ఈ అబ్బాయి అన్నాడు (ఇతనికోర్కెకాబోలు)

ఆ మాత్రం మా రఘునాథం యివ్వగలడేమో! అనుకున్నాను. సరే... పెళ్లి కొడుకు కోర్కెలు యింకా యేమున్నాయోనని ఆరాతీయబోయాను. స్కూల్ ఫైనల్ ప్యాసు అయిన పిల్ల అయితే మంచిదనీ, అలాంటిదే ఓ సమ్మంధం చూడటాన్కి తన స్నేహితుడు వెళ్లాడనీ యీ లుంగీ అబ్బాయి చెప్పాడు.

నాకు ఉత్సాహం నీరు గారిపోతోంది. ఒక్క మార్కులోపోయింది వసుంధర పరీక్ష.

అయినా! యితగాడేం ఉద్యోగం యివ్వడు కదా? పెళ్ళిచేసుకుంటాడు. కాపురంచేస్తాడు. అంతేగా! ప్యాసైంది అంటే సరి. సర్టిఫికెట్ తేండి చూస్తాను. అనడుగా! అమ్మాయిలకి అంతకన్న చదువేంచేసుకోనూ? చాదస్తంకానీ...

పిల్లతెల్లగా అని దంతం బొమ్మలాగ లేకపోయినా నల్లగా వుండకూడదట! తనేం మహాతెల్లగావున్నాడని? అని నేను లోపలలోపలే విసుక్కున్నాను. మా వసుంధరను చూస్తే అతనే నచ్చుకుంటాడు లెమ్మనుకున్నాను.

"మీ నేస్తం వస్తే కాస్త నాకు ఫోన్ చేస్తారూ? నేను అతనికి చాలా కావాల్సిన వాణ్ని' అంటూ ఆయువకుణ్ణికోరాను. మా ఆఫీసు "నెంబర్" కాయితం ముక్క మీదరాసి అందిస్తూ...

"అఫ్‌కోర్స్, ఐవిల్ ట్రాయ్" అన్నాడు, అతగాడు.

"థాంక్యూ...థ్యాంక్యూ" అంటూ లేచాను.

* * *

బయటకు వచ్చాను. నిక్షేపంలాంటి సంబంధం. వెనకాముందూ యెవరూ లేని సంబంధం. నేను రఘునాథం చెప్పినట్లు ఒక్క వారం రోజులముందు రావాల్సింది. వచ్చి వుంటే యీ కుర్రవాడు యిటు బందరెందుకు, సముద్రంలోకి? యించక్కా అటు గోదావరి (గోదావరి స్టేషన్‌లెండి) కే వచ్చేవాడు.

శ్యామలకు నేనేమని చెప్పను?

ఏం చేస్తాం? కల్పవృక్షంలాంటి సంబంధం పోగొట్టాననే నాలుగు అక్షింత గింజలూ నా నెత్తిన పడే ప్రారబ్ధం వున్నప్పుడు. అనుకుంటూ నేను నా 'బస' మొహం పట్టాను. కానీ ఆశపోలేదు.

రఘునాథరావు ఉత్తరం రాశాడు. ఆవుదయమే వచ్చిందట. మా కొత్త యిల్లు గలాయన యిచ్చాడు. ఏం రాయను?-పాపం! 'నువ్వు తీసుకుని రమ్మంటే, పిల్లను ఆవూరే తీసుకుని వస్తా. మీ యింట్లోనే ఏర్పాటు చేద్దాం. కుర్రవాణ్ణి వొచ్చి చూసుకోమను'-అని రాశాడు.

నేను జవాబు రాయలేదు.

వారం రోజులు పోయాక మరింత ఫెళ్ళున యెండకాస్తున్న వేళ నేనే కాళ్లీడ్చుకుంటూ గ్రంథం వారి మేడ 'పరవస్తువారి వీధి'కి పోయాను. ప్రకాశం ప్రక్కనున్న గదిలోని యువకుడు ఫోన్ నెంబరు పారేసుకున్నాడు కాబోలు! ఏ కబురూ లేదు.

ఈసారి యీ 'నైబర్‌పక్షి'కూడా లేడు.

ఎక్కడో పెళ్లిచూపులకని చూడ్డాన్కి వెళ్ళాడేమో? ఇవతల ప్రక్కనున్న యీలగానలోలుణ్నే పట్టుకున్నాను. నాలుగు యింగ్లీషు ముక్కలు నేనుకూడా 'ఝునా'యించే సరికి తెనుగులోకి దిగాడు

అతగాడు.

ప్రకాశం కంకిపాడు వెళ్ళాడన్నాడు

ఎందుకూ?

మాచ్ ఏదో వుందిట? అని చెప్పాడు.

నాకు ఇంకా ఆశవుంది. పోలేదు.

ఏం మ్యాచ్? చెడుగుడా? బాడ్ మింటనా? అన్నాను ఆశగా!

నవ్వాడు ఆయువకుడు. నన్ను అదోలాచూసి, మీలాంటివాడే ఎవరో పెద్ద మనిషి ఒకరు వచ్చి తీసుకెళ్ళారు -అని మళ్లీ నవ్వాడు.

నాకర్థమయింది. చివరికి కన్నవూరే గతి అయిందా?

ఇకరాడా?-అడిగాను దీనంగా.

వస్తాడుకాని 'యిట్ మే టేకే మంత్- నెల్లాళ్ళవుతుందేమో?

'సరి...సరి'...అన్నాను కసిగా.

ఆవూళ్లో అతని మేనమామగారి ఇంటికి వెళ్లాడు. లాంగ్ లీవ్‌మీద'- చెప్పాడు' ఈల గానలోలుడు.

'థ్యాంక్స్' చెప్పాను.

లేచాను. తిన్నగా కంకిపాడు వెళ్లాల్సిందే: ఎవరికోసం వెళ్తాను? 'దేఃవుడనే వాడున్నాడా?' మనిషికి కలిగెను సందేహం, అంటూ ప్రక్కనేవున్న ఒక పెళ్లి పందిట్లోంచి మాంచి ఎండవేళ పాట దంచేస్తోంది!

ఇన్ని యుద్ధాలూ ఇంత కరువూ ఇంత కలికాలం మండుతున్నా ఏబై గజాలకో పెళ్ళిచొప్పున ఝామ్మని అయిపోతున్నాయి.

ఇంతకీ ఈ ప్రకాశ మనేవాడున్నాడా? మా వసుంధరకు కూడా యీ సీజన్‌లోనే ఆ మూడు ముళ్ళూపడేనా? అన్న అనుమానం కలిగింది నాకు.

బస్సులో చాలా మంది యెక్కడికీ అంటే 'మావాళ్లింట్లో పెళ్లికి' అంటున్నారు. నేనూ, మా వసుంధర పెళ్లికి యిలానే అంటాను. నాకు సంతోషంగా వుంది ఆమాట తల్చుకునేటందుకు మా పెద్దమ్మాయికి యింకా నాలుగో ఏడు. రెండోదో, రెండోవాడో యింకా పుట్టాలి. పురిటికెళ్ళిందిగా మా యావిడ!

* * *

ఆచిన్నపల్లెటూళ్ళోకూడ ఝామ్మని నిర్మొహమాటంగా బెజవాడ ఎండలాగ, గ్రామఫోన్ రికార్డులతో, లౌడ్‌స్పీకర్‌లను బ్రద్దలుకొడుతూ రెండు పెళ్ళిళ్ళు అయిపోతున్నయ్!

నా గుండెలు గుబగుబలాడాయి.

ఒక ప్రక్క గాడ్పు గూబగుంయ్‌మని కొడుతోంది.

నన్నంతా, కొత్త మృగాన్ని చూసినట్లు చూస్తున్నారు. మళ్ళీ ప్రకాశం అంటూ 'వాకబు' చేసాను. "ఆ నాలుగోసందు" అన్నారు. అక్కడికి వెళ్ళాను. పెళ్ళి పందిరుంది. నాకు ధైర్యం చాలలేదు. అయినా ఒక పెద్ద మనిషిని అడిగాను.

"ఎవరిది బాబూ ఇక్కడ వివాహమూ?"

"చిన్నా వుటా = పల్లోరి పెద్ద బుల్లబ్బాయిది" అన్నాడు ఒకడు.

"బ్రతికాం" అనుకున్నాను.

ఈ పందిరి మీది లౌడ్‌స్పీకర్ 'గోలను' తలదన్నుతూ మరిన్ని లౌడ్‌స్పీకర్లతో గోలచేస్తో మరో ఫర్లాంగు దూరంలో మరో చిన్న పందిరుంది.

ఫలనా, అబ్బాయి అని అడుగుతూ వుంటే అందరూ ఆపందిరికేసే చూపెడుతున్నారు. నాకు దుఃఖంలాంటిది, ఏదో లోపల కలుగుతోంది. అక్కడకు చేరుకునేసరికి గొంతెండిపోయింది. ఆ పందిరీ; పచ్చతోరణాలూ; అన్నీ చూస్తూవుంటే ఇక నాకీ జన్మలో మా శ్యామల మొహం చూసే యోగ్యత లేదన్నది స్పష్టమయిపోతోంది.

భగవంతుడా! ఎంత పనిచేశావురా? ప్రకాశం అనడానికి బదులు దాహం అన్నాను నేను పందిట్లో చేరి! ఎవరో యిచ్చారు. ఆడపెళ్లివారా? మగపెళ్ళివారా? అన్నారు మరెవరో-నీళ్లతాగి తేరుకొని.

ఇది ఫలానీ యల్.యల్. ప్రకాశమూర్తి బి.ఎ (ఆర్.టి.సీ ఆఫీస్) బెజవాడ అబ్బాయి పెళ్ళేనా? అని భోగట్టాచేశాను.

"ఔను...తమరు మావాడి ఆఫీసులో పనిచేస్తారా'? అంటూ ఓ పెద్ద మనిషి నాచేతిలో ఓ కర్పూరపు పేరూ తాటాకు విసనకర్రా పడేశాడు.

ఇంకెక్కడ నేను?...ముచ్చెమటలు పోస్తున్నాయి. ఎండచేతకాదు. ఆ చెమట వేరు. ప్రకాశం అన్న వాడెవడో ఎలా వుంటాడో కానీ-ఆకుర్రాణ్ని ఒక్క గ్రుద్దుకు చంపేద్దామని పించింది. కాని పచ్చని పెళ్ళి పందిట్లో అంతదారుణంగా ఆలోచించలేకపోయాను అతనేం చేస్తాడు?

బహుశా యీ అమ్మాయి తెల్లగా వుందేమో దంతం బొమ్మలాగా...

బహుశా యీ అమ్మాయి స్కూలు ఫైనల్ డిస్టింక్షన్‌లతో పాసయిందేమో! తెలివైంది కాబోలు.

ఒకవేళ ఈ అమ్మాయి వయస్సు ప్రకాశం అనే శాల్తీ కోరినట్లు 19 సంవత్సరాలేనేమో.

కనీసం కట్నమేనా దండిగా పలికిందేమో... ఏమో!... ఏమో.

ఇవన్నీ నా కుతూహలాలు! నా దుఃఖాలు! భోగట్టా చేయకుండా ఎలా వుంటాను? చేశాను.

మేనమామ కూతురేనట? మొదటి నుంచీ వద్దూ అంటూనే చివరికి హోటలు కూడు తినలేనో అని మొత్తుకొని కుర్రాడు దారికొచ్చాట్ట! ఎంతమాట?

'కట్నమా?' బ్రతికి బాగుంటే తన తదనంతరం కుర్రాడికి రెండెకరాల "మెట్ట" యిస్తానని అన్నాడట (మేన)మామగారు.

ఎవరో అంతలో వచ్చారు. ఇన్ని అక్షింత నాచేతిలో పోశారు. లౌడ్ స్పీకరులో 'పయనమయే ప్రియతమా' పాట మానేసి వాయిద్యాలు, మంత్రాలు రువ్వేస్తున్నాయి.

పెళ్ళయిపోతోంది! గ్రుక్కతిప్పుకోకుండ ఐపోతోంది. నేనాపలేను. ఈ పెళ్ళి? మా వసుంధరది కాదు ఎవరిదో!

కానీ! ప్రకాశం అన్న ఆ కుర్రాణ్ణి మొదటి సారీ ఆఖరి సారీ, యింత దూరమూ ఎలాగా వచ్చాము కనుక ఓసారి చూడాలీ అనుకున్నాను.

ఉక్కుముక్కలా వున్నాడు. మా వసుంధరకు దీటురాడు. పెళ్ళి కూతుర్ని చూశాను. రామ రామ తెలుపుకాకపోతే అదేపాయె కృష్ణమ్మే! పైగా చిన్నకళ్ళు, పెద్ద చెవులూ.

ఎనిమిదో క్లాసు దాకా బళ్ళోకి వెళ్ళిందట! మా వసుంధరను చూస్తేనా? యీ కుర్రాడు

సాష్టాంగ పడి మరీ చేసుకుంటానని అడిగేవాడు...ప్చ్...ప్చ్...అక్షింతలు అరచేతి చెమటకి నానిపోతున్నాయి. వేయనా? మాననా?

ఏమొహం పెట్టుకుని వేస్తాను?

శ్యామల బేలమొహం, అనుదుట ఎర్రని కానీ కాసంతబొట్టూ, ఆర్ద్రమైన కనులతో "అన్నయ్యగారూ' అంటూ కనబడ్డది.

అన్నయగారినా? నేనా! ఛీ..

ఈ అక్షింతలు మా వసుంధరకు వేయాలి. ఈ ప్రకాశం ఎవడుమనకి! అనుకున్నాను. వెను దిరగబోతున్నాను. మంగళ వాద్యాల మధ్య మంత్రాల మధ్య అక్షింతలు వేయండి వేయండి- అంటున్నారు.

మంగళ సూత్రధారణ జరుగుతోంది.

చూశాను మరోసారి వెనుదిరిగి -పెళ్ళి కూతురు ఎవరైతేనేం? శోభాయమానంగా వుంది. ఈ పచ్చని పందిరికి క్షణం క్రింద నిప్పంటుకోరాదూ? అనుకున్న నాకు యిప్పుడు పశ్చాత్తాపంగా వుంది.

పెళ్ళికూతురు ప్రక్కనే ఆ పిల్లతల్లి కాబోలు వున్నది. తను నవమాసాలు మోసికన్న ప్రాణి! పెంచిన కన్నె! తనలోనుంచి వచ్చిన తన తపన-తన భాగం-తనే వేరై పెరిగిన ప్రాణి! పరాయిదైపోతూంటే... ఆ తల్లి పడే వేదన ఒక చెంప-తన బాధ్యత తీరుతున్నది అనే తృప్తి, రెండో చెంప ప్రతిబింబిస్తూ వుంటే మాతృమూర్తి అచ్చం మా శ్యామలలాగేవుంది!

మా శ్యామలకూ, ఈమెకూ భౌతిక రూపంలో పోలికలు లేవే మోకాని, నాకు ఆమెలో శ్యామల కనబడ్డది.

అక్కడ పెళ్ళిపీటలమీద కూర్చున్నది. మా వసుంధారా?...కాకపోవచ్చును..

కాదు...కాని అవుతున్నది సామాజిక మైన శుభకార్యం.

మంగళతూర్యారావాల మధ్య ఈ ఇద్దరికీ యిలాముడి పడవల్సివుంది కాబోలు. ఇది ఘటన...నేనెవర్ని?

'దీర్ఘ సుమంగళీభవ' అంటూ పెళ్ళి కూతురుమీదా, దీర్ఘాయుష్మన్భవా అంటూ వరుని తలమీద అక్షింతలు అప్రయత్నంగా ఏదో అభూత శక్తి ప్రేరణ క్రింద పనిచేస్తున్న యంత్రంలా వేసేను. ఆ పందిరికేసి ఆ పై నున్న మండుటెండాకాశంకేసి చూశాను.

తిరుగుముఖం పట్టాను.

ఎండ అలాగే మండిపోతోంది.

నా గుండెల్లో కూడా అలాగేవుంది.

కండువాతీసి నెత్తిన కొంగువేసుకున్నాను....

(1971, స్వాతి)